# కాంగ్రెస్‌కు విజయోత్సవాలు ఎందుకో?

- ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిన సర్కార్
- గురుకులాలను సందర్శిస్తున్న ప్రవీణ్‌కుమార్‌పై విమర్శలు సరికాదు
- విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, డిసెంబర్ 3 : ఏడాది పాలనలో ఏం సాధించారని విజయోత్సవాలు చేసుకుంటున్నారో కాంగ్రెస్ నాయకులకే తెలియాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన తుపాకీ రాముడిని మైమరిపించే విధంగా ఉందని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఎద్దేవా చేశారు. మణుగూరులోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో.. 420 మోసాలతో ప్రజలను మోసం చేసేందుకు సంబురాలు చేసుకుంటున్నారా.. అని ప్రశ్నించారు. కలుషిత ఆహారం విషయమై రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలను సందర్శిస్తున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌పై స్థానిక ఎమ్మెల్యే విమర్శలు చేయడంపై ఆయన ధ్వజమెత్తారు. విద్యార్థులకు భవిష్యత్‌ను ఇచ్చే ధైర్యం లేక.. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించలేక..

జరిగిన తప్పును పరిష్కరించే తెలివితేటలు లేక సందర్శనకు వచ్చిన వారిపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏడాది కాలంలో 46 మంది విద్యార్థులు మృతిచెందితే కనీసం సీఎం, మంత్రులు రివ్యూ సమావేశం నిర్వహించలేదన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అదానీ ఇచ్చిన రూ.వంద కోట్లు తిరిగి ఇచ్చింది నిజం కాదా.. అని ప్రశ్నించారు. అధికారం ఉందని విర్రవీగి మా పార్టీ నేతలు, నాయకులను విమర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ పోశం నర్సింహారావు, ముత్యం బాబు, కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, నూకారపు రమేశ్, ఉద్దంగుల కృష్ణ, బొలిశెట్టి నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ముంచారు


## అంతన్నారు.. ఇంతన్నారు..

- లక్షల్లో రైతులు.. వేల మందికే రుణమాఫీ
- చేతులు దులుపుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- భద్రాద్రి జిల్లాలో రుణాలు తీసుకున్నది 1,85,750 మంది..
- మాఫీ అయ్యింది 64,187 మందికి మాత్రమే..
- రైతు భరోసా (రైతుబంధు) సైతం ఎగ్గొట్టిన ప్రభుత్వం
- సర్కార్ తీరుపై అన్నదాతల ఆగ్రహ జ్వాలలు

రైతులకు అరకొరగా రుణమాఫీ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు. విడతల వారీగా అంటూ చివరికి మొండి 'చెయ్యి' చూపించిందంటూ రైతులు మండిపడుతున్నారు. చేసిందేమీ లేకుండానే ఏడాది పాలన సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటు అంటూ నిరాశ వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,85,750 మంది రైతులకు.. 64,117 మందికి మాత్రమే రుణమాఫీ చేయడంతో సర్కారు చేతిలో దగా పడ్డామంటూ గుర్రుగా ఉన్నారు. రైతు ప్రభుత్వమని చెబుతూ రైతు సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్ సర్కారు తీరుపై సర్వత్రా రైతాంగం మండిపడుతున్నది.

అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు రైతులను నట్టేట ముంచారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా పంట రుణాలు తీసుకున్న రైతులు 1,85,750 మంది ఉండగా.. కేవలం 64,187 మందికి మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నది. నాల్గో విడత విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో సైతం తమ పేర్లు లేకపోవడంతో ఎవరికి చెప్పకోవాలో అర్థంకాక అన్నదాతలు మదనపడుతున్నారు. తమ తోటి రైతులకు రుణమాఫీ అయ్యి.. తమకు కాకపోవడంతో అయోమయంలో ఉన్నారు. రుణమాఫీ ముగిసిందని సీఎం ప్రకటన చేయడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇక రూ.2 లక్షలకు పైబడి రుణాలు ఉన్నవారి ఆశలు అడియాశలయ్యాయి. ఈ ఏడాది వానకాలం, యాసంగి పంటలకు రైతు భరోసా (రైతుబంధు) సైతం ఎగ్గొట్టడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ)



### తప్పిదాలకు బాధ్యులెవరు?

రైతు రుణమాఫీ అనగానే రైతులు పెద్ద ఎత్తున స్పందించి కాంగ్రెస్ నాయకులకు ఓట్లేసి గెలిపించారు. తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుణమాఫీ కాస్త కొంతమందికే ఇవ్వడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. విడతలుగా రుణమాఫీ చేస్తాం.. ప్రతి రైతుకు రుణమాఫీ వస్తది అని చెప్పిన సర్కారు రేషన్ కార్డులు లేని వారికి ఎగ్గొట్టింది. బ్యాంకు అకౌంట్ నంబర్లు తప్పుపడ్డాయని, పేర్లు సరిగా లేవని మరికొందరు ఆశలపై నీళ్లు చల్లింది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రేషన్ కార్డులేని రైతులు 20 వేల మందికి పైగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. వీరి పేర్లతో జాబితాను కూడా తయారు చేసింది. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ పెట్టి రుణమాఫీ రాని రైతుల ఫిర్యాదులను కూడా స్వీకరించారు. కానీ.. వారందరికీ నేటికీ రుణమాఫీ కాలేదు.

### 64,187 మందికి మాత్రమే..

ప్రభుత్వం అధికారంలోకి రాగానే మొట్టమొదటగా రుణమాఫీ రైతుల బ్యాంకు ఖాతాల్లో వేస్తామన్న సర్కారు ఆదిలోనే ముఖం తిప్పేసింది. దాన్ని విడతల వారీగా ఇస్తామని చెప్పి మొదటి విడతలో 28,450 మందికి రూ.134 కోట్లు వేసి చేతులు దులుపుకోవడంతో అప్పట్లో రైతులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. తర్వాత రెండో విడత అని మరో 16,889 మందికి గాను రూ.143 కోట్లు వేయడంతో మరింత మంది మాకు రాలేదని బ్యాంకులు, సొసైటీల వద్ద నిరసన తెలిపారు. అదీకాక మూడో విడత, నాల్గో విడత అని 11,566 మందికి.. రూ.125 కోట్లు, 7,282 మంది రైతులకు రూ.59 కోట్లు వేసి చేతులు దులుపుకున్నారు. రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్న వారికి కూడా రుణమాఫీ ఇస్తామని ఆశ రేపి చేయలేకపోయారు. కొర్రీలతో నిలిచిపోయిన రూ.2 లక్షల లోపు రుణాలు కూడా మాఫీ చేయలేకపోయారు. దీంతో సన్నకారు రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### రైతు భరోసా ఊసేలేదు..

ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోతున్న రైతులకు మరోవైపు ప్రభుత్వం సాయం అందించకుండా చుక్కలు చూపిస్తోంది. దీంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై రగిలిపోతున్నారు. ప్రతిరోజు ఏదో సందర్భంలో పంటలను వదులుకొని రోడ్కెక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. రైతు భరోసా ఇవ్వాల్సిన సర్కారు రెండు పంటలు కాలం గడిచిపోయినా ఆ ఊసే ఎత్త డం లేదు. పంటలు సర్వే చేయాలని ఏఈవోలపై ఒత్తిడి తేవడంతో వ్యవసాయ శాఖలో పనిచేసే ఉద్యోగులే ప్రభుత్వంపై నిరసన తెలిపారంటే ప్రభుత్వంపై వ్యతిరేకత ఎంతమేరకు ఉందో వేరే చెప్పనక్కర్లేదు.

### రూ.20 వేలు కూడా మాఫీ కాలేదు..



నాకు మా నాన్న వాళ్లతో రేషన్ కార్డు ఉంది. వేరే ఉంటున్నాను. పంటలు వేశాను. బ్యాంకులో రుణం తీసుకున్నాను. రూ.20 వేలు తీసుకుంటే వడ్డీతో రూ.27 వేలు అయ్యింది. కానీ.. నాకు రుణమాఫీ కాలేదు. నా లాంటి వాళ్లు మా ఊర్లో చాలామంది ఉన్నారు. అందరం కలిసి ఉండడం తప్పా లేక వ్యవసాయం వేరే చేయడం తప్పా అని ఆలోచించాల్సి వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను చాలా ఇబ్బంది పెడుతున్నది.

– కాసిబోయిన సతీశ్, రైతు, చినబండిరేవు, దుమ్ముగూడెం మండలం

### నాల్గో విడతలోనూ పేరు లేదు..



నా పేరున బేతంపూడి సొసైటీలో రూ.50 వేల రుణం ఉంది. మొదటి విడత రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడంతో అధికారులను అడిగాను. మీ అమ్మ పేరున రూ.1.20 లక్షల రుణం ఉందని చెప్పారు. మూడో విడతలో పేరు వస్తుందని అధికారులు చెప్పినా.. అందులోనూ పేరు లేదు. మళ్లీ వెళ్లి అడిగితే ఆధార్ నంబర్ తప్పుగా పడింది.. అందుకే కాలేదని చెప్పారు. దానిని సరి చేయించాను. నాల్గో విడుతలోనూ మాఫీ కాలేదు. కాంగ్రెసోళ్లు ముందు చెప్పిందొకటి.. ఇప్పుడు చేస్తున్నదొకటి. ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

–తోటకూరి సతీశ్, రైతు, టేకులపల్లి

### బంగారం తాకట్టు పెట్టి అప్పు కట్టాను..



నా పేరున అన్నపురెడ్డిపల్లి ఏపీజీవీబీలో రూ.1.93 లక్షలు, గుంపెన సొసైటీలో రూ.73 వేల రుణం ఉంది. రెండు బ్యాంకులలో మొత్తం రూ.2. 66 లక్షల రుణం ఉంది. మూడో విడతలో రూ.2 లక్షలలోపు రుణాలు ఉంటే మాఫీ చేస్తామని చెప్పడంతో గుంపెన సొసైటీలోని రూ.73 వేలను నా భార్య బంగారం తాకట్టు పెట్టి అప్పు కట్టాను. అయినా.. రూ.2 లక్షల లోపు రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. అధికారులను అడిగితే సమాధానం చెప్పడం లేదు. అధికారులు రుణమాఫీ చేసి నాకు న్యాయం చేయాలి.

–కోటేశ్వరరావు, రైతు, అన్నపురెడ్డిపల్లి

### రూ.1.90 లక్షలు మాఫీ రాలేదు..



నాకున్న రూ.1.90 లక్షల రుణం నాలుగు విడతల్లోనూ మాఫీ కాలేదు. ప్రభుత్వం అర్హులైన రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పినా.. అది అమలు కావట్లేదు. మా ఊళ్లోనే 50 మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదు. నాకు అన్ని అర్హతలున్నా మాఫీ చేయలేదు. రుణం ఇచ్చే ముందు లేని అనుమానాలు ఇప్పుడెందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదు. కొర్రీలు పెట్టకుండా రుణమాఫీ చేయాల్సిందే.

–చాపలమడుగు రామరాజు, రైతు, అయ్యన్నపాలెం, చంద్రుగొండ మండలం

### నిబంధనలతో ఇబ్బందులు..



నేను మధ్యతరగతి రైతును. నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. బ్యాంకులో రూ.2 లక్షల రుణం తీసుకున్నా.. నాలుగు విడతల్లో అధికారులు మాఫీ చేయలేదు. రుణమాఫీ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నా. రైతులకు ముందుగా హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయాలి. కొత్త కొత్త నిబంధనలు పెట్టి ఇబ్బందులు పెట్టడం సరికాదు.

–బుద్ధ వెంకటేశ్వర్లు, రైతు, తిమ్మంపేట, ములకలపల్లి మండలం

# మానసిక రుగ్మతల సమస్యపై తీసుకుంటున్న చర్యలేమిటి?

## రాజ్యసభలో ప్రశ్నించిన ఎంపీ వద్దిరాజు



రాజ్యసభలో మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, డిసెంబర్ 3 : రాజ్యసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా జరిగిన చర్చలో భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. మానసిక ఆరోగ్య రుగ్మతలపై ప్రజల్లో అవగాహన, శ్రేయస్సు పెంపొందించేందుకు గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో ఎటువంటి చర్యలు చేపట్టారు? అని ఎంపీ వద్దిరాజు ప్రశ్నించారు. ఈ విషయంలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారా? ఈ సమస్య నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి? అందుకుంటున్న సాంకేతిక సహాయమేమిటి? కేటాయించిన నిధులెన్ని? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జగత్ ప్రకాష్‌నడ్డా, సహాయ మంత్రి ప్రతాపరావు గణపత్‌రావు జాదవ్ బదులిచ్చారు. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో ప్రాథమిక వైద్యారోగ్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

# శ్రీకాంతాచారి ఆశయాలను నెరవేరుద్దాం..

## వర్ధంతి వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు



శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ నాయకులు

ఖమ్మం, డిసెంబర్ 3 : తెలంగాణ ఉద్యమకారుడు, అమరజీవి శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిదని, ఆయన ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆదేశాల మేరకు శ్రీకాంతాచారి వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీకాంతాచారి ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున లేపిందన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అనేకమంది తెలంగాణ బిడ్డల ప్రాణాలను బలి తీసుకున్నదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, న్యాయవాది, ఉద్యమకారులు బిచ్చాల తిరుమలరావు, డోకుపర్తి సుబ్బారావు, మేకల సుగుణారావు, నిరోషా, రాజేష్, బలుపు మురళి, బెల్లం వేణు పాల్గొన్నారు.

**చిరస్థాయిగా శ్రీకాంతాచారి త్యాగం : మాజీ ఎంపీ నామా**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో రాష్ట్ర సాధన కోసం 2009 డిసెంబర్ 3న తన ప్రాణాలను అర్పించిన కాసోజు శ్రీకాంతాచారి త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని బీఆర్‌ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ, నాడు కేసీఆర్ అరెస్టుకు నిరసనగా నవంబర్ 29న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శ్రీకాంతాచారి ఐదురోజులపాటు గాయాలతో పోరాడి, చివరకు డిసెంబర్ 3, 2009న జై తెలంగాణ నినాదంతో తుది శ్వాస విడిచారు అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు శ్రీకాంతాచారి చేసిన ఆత్మార్పణం తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తుందని, తెలంగాణ ఉద్యమ విజయానికి ఆయన త్యాగం స్ఫూర్తిగా నిలిచిందన్నారు. మనమంతా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు.

# ఆదివాసీల జీవన విధానం ఆదర్శనీయం

## ఐటీడీఏలో పర్యటించిన మహారాష్ట్ర శాస్త్రవేత్తల బృందం



గిరిజన మ్యూజియంను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

భద్రాచలం, డిసెంబర్ 3 : ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ఆదర్శనీయమని మహారాష్ట్ర శాస్త్రవేత్తల బృందం సభ్యులు పేర్కొన్నారు. జిల్లాలో అధిక శాతం ఉన్న ఆదివాసీ గిరిజనుల జీవన విధానం, వారి ఆచార సంప్రదాయాల పరిశీలన కోసం మహారాష్ట్ర శాస్త్రవేత్తల బృందం డాక్టర్ శ్రీకాంత్ గంగా, రాహుల్‌కుమార్, సిద్ధి పెడ్నేకర్, అమబుత టెల్బేలు భద్రాచలం ఐటీడీఏకు మంగళవారం చేరుకున్నారు. తొలుత గిరిజన మ్యూజియంను సందర్శించగా.. గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి వివరించారు. అనంతరం ఐటీడీఏలో వివిధ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. తర్వాత దుమ్ముగూడెం మండలం చిన్ననల్లబెల్లి పంచాయతీ పరిధిలోని టైలరుపేటను సందర్శించిన బృందం సభ్యులు.. ఆదివాసీ గిరిజనుల జీవన స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎంహెచ్‌ఆర్‌సీ నాగేశ్వరరావు, ఆర్ఐ వెంకటేశ్వర్లు, దుమ్ముగూడెం ఏపీఎం హేమంత్, డీపీఎం రంగారావు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మామిళ్లగూడెం, డిసెంబర్ 3 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వ్యవసాయ కార్మికులు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవన భృతి, కొత్త పెన్షన్లు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇస్తామని చెప్పి విస్మరించారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డికి అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం, కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, నాయకులు కంకణాల అర్జున్‌రావు, బీరెల్లి లాజర్, గోగుల సోములు, వెంకటప్పారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరద నష్టం రూ.672.78 కోట్లు

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- నిపుణుల బృందానికి నష్టం వివరాలు అందజేత



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, డిసెంబర్ 3 : జిల్లాలో మూడు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదలతో అన్ని శాఖల పరిధిలో రూ.672.78 కోట్ల నష్టం వాటిల్లిందని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లాకు వచ్చిన వరద నష్టం అంచనా నిపుణుల బృందానికి వరద తీరు, చేపట్టిన చర్యలు, నష్టం వివరాలను మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కురిసిన భారీ వర్షాల కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించామని తెలిపారు. వరదల వల్ల 15,258 ఇండ్లు దెబ్బతిన్నాయని, ఇంటికి జరిగిన నష్టానికి రూ.16,500 చొప్పున లబ్ధిదారులకు పరిహారంగా చెల్లించినట్లు తెలిపారు. సీబీఆర్ఐ డైరెక్టర్ ఆర్.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ 17 మందితో కూడిన సభ్యుల బృందం పోస్ట్ డిజాస్టర్ నీడ్స్ అసెస్మెంట్ కోసం వచ్చినట్లు తెలిపారు. నష్టం ఎంత జరిగింది? రికవరీ ఎంత అవసరం? పునర్నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుంది? అని అంచనా చేయడానికి వచ్చినట్లు తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారుల నుంచి నష్టం వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్వో రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో విపత్తు నిర్వహణ బృందం పర్యటన

## నష్టం వివరాలు వివరించిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్



భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌తో విపత్తు నిర్వహణ బృందం సభ్యులు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : మూడు నెలల క్రితం జిల్లాలో కురిసిన వర్షాలు, వరదలతో జరిగిన నష్టం తీరును తెలుసుకునేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్(విపత్తు నిర్వహణ) కేంద్ర, రాష్ట్ర బృందం సభ్యులు జిల్లాలో మంగళవారం పర్యటించారు. తొలుత బృందం సభ్యులు కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు, వరదలతో సంభవించిన నష్టాలు, అధికారులు చేపట్టిన సహాయక చర్యల గురించి బృందం సభ్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భారీ వర్షాలతో ఏడు ముంపు ప్రభావిత మండలాల్లో పంట నష్టంతోపాటు దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ వ్యవస్థ గురించి ప్రాంతాల వారీగా వివరించారు. వరదల సమయంలో సహాయక చర్యల కోసం భారీ డ్రోన్లు, పుట్టీలు, పడవలు, ఇతర పరికరాలను వినియోగించినట్లు తెలిపారు. బృందంలో ప్రవీణ్, శ్రీనివాస చారి, ఐశ్వర్య, రవిపాల్, అధికలాం, సాయిబాబా, ప్రదీప్‌కుమార్, వరుణ్, మోతీలాల్, శ్రీనివాస్ ఉన్నారు.

# నిరంతర పర్యవేక్షణ ఉండాలి

## భద్రాద్రి జోన్ గురుకులాల జోనల్ అధికారి స్వరూపరాణి





విద్యార్థులతో మాట్లాడుతున్న జోనల్ అధికారి స్వరూపరాణి

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 3 : గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని భద్రాద్రి జోన్ సాంఘిక సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి కె.స్వరూపరాణి సూచించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఇటీవల గురుకులంలోని విద్యార్థులు మద్యం సేవించినట్లు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ వీడియో పాతది అని, దానిని ఇప్పుడు సోషల్ మీడియోలో పెట్టడం సరికాదన్నారు. విద్యార్థులపై పర్యవేక్షణ లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు ఆమె పలు సూచనలు చేశారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌కు మంచి బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీవో మహాలక్ష్మి, ఎంఈవో ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

